సాక్షి మంచిర్యాల

గురువారం: 28 మార్చి 2024



నిప్పుతో జాగ్రత్త!
చిన్న చిన్న తప్పిదాలతో నిత్యం ఏదో ఒక చోట అగ్ని ప్రమాదాలు సంభవిస్తున్నాయి. దీంతో ఆస్తి, ప్రాణనష్టం జరుగుతోంది. అప్రమత్తతతో వ్యవహరిస్తే నివారించే వీలుంది. 8లో▸



రంజాన్ వేళలు

ఇఫ్తార్	సహర్
గురు : 6:30	శుక్ర: 4:51

గరిష్టం/కనిష్టం
38.0 /25.0

వాతావరణం
ఆకాశం ప్రకాశవంతంగా ఉంటుంది. ఆగ్నేయం దిశగా గాలులు వీస్తాయి. ఉష్ణోగ్రతలు మరింతగా పెరిగే అవకాశం ఉంది. ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

నేడు ప్రభుత్వ భూములపై విచారణ

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ భూములపై అందిన ఫిర్యాదు మేరకు కమిషనర్ అండ్ డైరెక్టర్ సర్వే, సెటిల్‌మెంటు, ల్యాండ్ రికార్డ్స్ ఉన్నతాధికారులు గురువారం విచారణ చేపట్టనున్నారు. సర్కారు భూములు కబ్జాకు గురవుతున్నాయని, స్థానిక సర్వే, రెవెన్యూ, మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదని, తప్పుడు రిపోర్టులు ఇచ్చారని బీజేపీ నాయకుడు తులా మధుసూదన్‌రావు లోకాయుక్త, విజిలెన్స్, సర్వే శాఖకు ఫిర్యాదు చేశారు. స్పందించిన ఉన్నతాధికారులు ఈ నెల 21న డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే, స్థానిక సర్వేయర్, మంచిర్యాల తహసీల్దార్‌తోపాటు మొత్తంగా 14మందికి నోటీసులు జారీ చేశారు. గురువారం గర్మిళ్ల శివారు బస్టాండ్ వెనుక వైపు ఉన్న 422, 92, 93 సర్వేనంబర్లలో భూమిని సర్వే అధికారులు పరిశీలించనున్నారు. ఇక్కడి సర్కారు భూమి ఆక్రమణలపై గత కొంతకాలంగా విచారణ జరగగా, తాజాగా సర్వే విభాగం నుంచి డిప్యూటీ డైరెక్టర్ నేరుగా వచ్చిన వివరాలు సేకరించనున్నారు. ఈ మేరకు స్థానిక అధికారులు, మోకాపై ఉన్న వారు అన్ని రికార్డులతో రావాలని కోరారు.

నర్సరీల్లో మొక్కలు సిద్ధం చేయాలి

- జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్



మాట్లాడుతున్న కలెక్టర్ సంతోష్

పాతమంచిర్యాల: జిల్లాలో నాటడానికి నిర్దేశించిన లక్ష్యానికి అనుగుణంగా నర్సరీల్లో మొక్కలు సిద్ధం చేయాలని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ రాహుల్, జిల్లా అటవీ అధికారి శివ్ ఆశీష్ సింగ్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి కిషన్, అటవీ అధికారులు, మున్సిపల్ కమిషనర్లతో నర్సరీల నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ మొక్కల సంరక్షణకు షేడ్‌నెట్‌లు ఏర్పాటు చేయాలని సూచించారు.

పోషకాహార లోపాలు అధిగమించాలి

మంచిర్యాలటౌన్: జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పిల్లల్లో పోషకాహార లోపాలు అధిగమించాలని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. జిల్లా కలెక్టరేట్‌లో బుధవారం జిల్లా సంక్షేమ శాఖ అధికారులు, కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు, సీడీపీవోలు, సమన్వయకర్తలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో న్యూట్రీ గార్డెన్లు ఏర్పాటు చేసి పిల్లల్లో పోషకాహార లోపాలను అధిగమించేలా బెల్లంపల్లి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తల సలహాలతో ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా మహిళా, శిశు, దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ అధికారి కె.చిన్నయ్య, కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు, సమన్వయకర్త డాక్టర్ కోట శివకృష్ణ పాల్గొన్నారు.

నేడు బార్ అసోసియేషన్ ఎన్నికలు

మంచిర్యాలక్రైం: జిల్లా బార్ అసోసియేషన్ ఎన్నికలు ఈ నెల 28న నిర్వహించనున్నట్లు ఎన్నికల కమిషనర్ కే.కమలమనోహర్‌రావు, అసిస్టెంట్ కమిషనర్ గుంటుకు మహేందర్ తెలిపారు. ఎన్నికల నిబంధనలు పాటించాలని పోటీలో ఉన్న అభ్యర్థులు, ఓటర్లకు సూచించారు. ఉదయం 10.గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు స్థానిక బార్ అసోసియేషన్ హాల్‌లో ఓటింగ్ నిర్వహిస్తామని పేర్కొన్నారు. అనంతరం ఓట్లు లెక్కించి ఫలితాలు ప్రకటిస్తామని తెలిపారు. పోలింగ్ కేంద్రంలోకి ఎలక్ట్రానిక్ వస్తువులు, స్మార్ట్‌వాచ్, మొబైల్, కెమెరాలు అనుమతించబోమని తెలిపారు. ఓటర్లు స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకుని సహకరించాలని తెలిపారు.

నగదు పట్టివేత



నగదు అప్పగిస్తున్న పోలీసులు

కాసిపేట: కాసిపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని జాతీయ రహదారిపై చొప్పరిపల్లి సమీపంలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద బుధవారం రాత్రి పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. రూ.81వేల నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై ప్రవీణ్ తెలిపారు. కరీంనగర్‌కు చెందిన ఎండీ రియాజ్ ఆధారాలు లేకుండా వాహనంలో తరలిస్తున్న నగదును స్వాధీనం చేసుకుని ఎస్‌ఎస్‌టీ టీంకు అప్పగించినట్లు చెప్పారు.

రూటు మారిన దందా!

- సిరొంచకు బంద్ కావడంతో ఇతర మార్గాలు
- ఇంద్రవెల్లి, రెబ్బెన కేంద్రాలుగా మహారాష్ట్రకు
- జిల్లా గుండా ఆగని రేషన్ బియ్యం రవాణా



ఈ నెల 13న జన్నారంలో రేషన్ బియ్యం తరలిస్తూ పట్టుబడిన వాహనం

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: రేషన్ బియ్యం దందాలో ఒకరిని మించి మరొకరు ఆరితేరడంతో అక్రమ రవాణా నిత్యకృత్యమైంది. ఈ నెల 21న మహారాష్ట్రలోని సిరొంచ వ్యాపారిని భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలం కాళేశ్వరంలో పౌరసరఫరాల శాఖ టాస్క్‌ఫోర్స్ అదుపులోకి తీసుకుంది. దీంతో ఆ స్థానాన్ని భర్తీ చేసేందుకు కొందరు వ్యాపారులు దళారులతో పోటీ పడుతున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూ.వందల కోట్లు ఖర్చు చేసి బియ్యం పంపిణీ చేస్తున్నాయి. చాలాచోట్ల లబ్ధిదారులు బియ్యాన్ని వినియోగించడం లేదు. కొందరు డీలర్లు, లబ్ధిదారుల నుంచి బియ్యం కిలోకు రూ.10 చొప్పున కొనుగోలు చేసి రూ.15కు అమ్ముకుంటున్నారు. వ్యాపారులు మళ్లీ మహారాష్ట్రలో రూ.20వరకు కిలో చొప్పున విక్రయిస్తున్నారు. పౌరసరఫరాల శాఖ నిలువరించలేకపోవడంతో దందా సాగుతోంది.

ఇంద్రవెల్లి కేంద్రంగా..

ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి కేంద్రంగా ఓ వ్యాపారి రేషన్ దందా సాగుతోంది. జన్నారంలో పట్టుబడిన వంద క్వింటాళ్ల పీడీఎస్ బియ్యంలో ప్రధాన సూత్రధారిగా ఉన్నారు. లక్సెట్టిపేట, దండేపల్లి, జన్నారం, నిర్మల్ జిల్లా బీర్పూర్, దస్తూరాబాద్, కడెం, మండలాల నుంచి భారీగా బియ్యం ఇంద్రవెల్లి మీదుగా మహారాష్ట్రకు రవాణా చేస్తున్నారు. ఇటీవల జన్నారంలో పట్టుబడిన సమయంలో ఐచర్ వ్యాన్ ముందు, వెనకవైపు ఎస్కార్ట్‌గా కార్లలో వెళ్తూ పట్టుబడ్డారు. ఇక కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా రెబ్బెన మండల కేంద్రంగా మరొకరు రేషన్ దందా సాగిస్తున్నారు. ఆయనపై పలు కేసులు ఉన్నప్పటికీ తీరు మారడం లేదు. మందమర్రి, బెల్లంపల్లి, తాండూరు, భీమిని, కన్నెపల్లి మండలాల నుంచి బియ్యం కొనుగోలు చేస్తూ రెబ్బెన, కాగజ్‌నగర్, సిర్పూర్(టీ) మీదుగా మహారాష్ట్రకు తరలిస్తున్నారు.

జిల్లా కేంద్రంలో ఓ వ్యాపారి

జిల్లా కేంద్రంలోని ఓ వ్యాపారి తన రైస్‌మిల్లుకు తరలిస్తూ గుట్టుచప్పుడు కాకుండా దందా చేస్తున్నారు. సీఎంఆర్(కస్టం మిల్లింగ్ రైస్) కింద పౌరసరఫరాల శాఖకు తిరిగి బియ్యం అప్పగిస్తున్నారు. రైస్‌మిల్లుతోపాటు పలు వ్యాపారాల్లో ఉన్న ఆయన జిల్లా కేంద్రంలో పలు కాలనీల నుంచి మధ్యవర్తుల నుంచి బియ్యం కొనుగోలు చేస్తున్నారు.

సిరొంచకు బంద్

ఇటీవల సిరొంచ వ్యాపారి చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్‌ను కలిసి తన దందాకు కొందరు కాంగ్రెస్ నాయకులు అడ్డుపడుతున్నారని, డబ్బులు ఇవ్వాలని ఒత్తిడి తెస్తున్నారని మొరపెట్టుకున్నారు. ఈ వివాదం పెద్ద దుమారాన్నే రేపింది. గతంలో బీఆర్‌ఎస్ నాయకులు సైతం ఆ వ్యాపారి నుంచి పెద్ద ఎత్తున వసూళ్లకు పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయి. కోటపల్లి మండలానికి చెందిన ఓ నాయకుడు గత ఎమ్మెల్యే పేరు చెప్పి ఆ వ్యాపారి నుంచి ప్రతీ నెల వసూళ్లు చేశారు. పార్టీ అవసరాల కోసమని డబ్బులు తీసుకునేవారు. అదే తీరుగా ప్రస్తుత అధికార పార్టీకి చెందిన కొందరు నాయకులు వ్యాపారి నుంచి డబ్బులు తీసుకోవాలని ప్రయత్నించి విఫలమయ్యారు. ఈ ఘటనల తర్వాత అంతర్రాష్ట్ర సరిహద్దుల్లో నిఘా పెరగడంతో సిరొంచకు బియ్యం రవాణా నిలిచిపోయింది.

ఈ నెలలో పట్టుబడ్డ బియ్యం

- ఈ నెల 6న లక్సెట్టిపేట పట్టణం సాయినగర్‌కాలనీలో 15క్వింటాళ్ల బియ్యం తరలిస్తుండగా పోలీసులకు పట్టుబడ్డాయి.
- ఈ నెల 13న దండేపల్లి మండలం నెల్కివెంకటపూర్‌కు చెందిన శ్రవణ్ 110క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని ఇంద్రవెల్లికి చెందిన వ్యాపారి సంతోష్ వద్దకు జన్నారం మీదుగా తరలిస్తుండగా స్థానిక ఎస్సై సతీశ్ పట్టుకున్నారు.
- ఈ నెల 18న మందమర్రి మండలం చిర్రకుంటలో అక్రమంగా రవాణా చేస్తున్న మూడున్నర క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్థానిక పోలీసులు పట్టుకున్నారు.



మందమర్రి మండలం చిర్రకుంటలో రేషన్ బియ్యం తరలిస్తూ పట్టుబడిన ట్రాలీ ఆటో

టాస్క్‌ఫోర్స్ గత జనవరి నుంచి మార్చి వరకు నమోదు చేసిన కేసులు

మొత్తం కేసులు: 20
పట్టుబడిన వారు: 32 మంది
స్వాధీనం చేసుకున్న బియ్యం: 427.3 క్వింటాళ్లు
విలువ : రూ.9.25 లక్షలు

నిరంతరం నిఘా



రేషన్ బియ్యం అక్రమంగా తరలించే వారిని ఎట్టి పరిస్థితిల్లోనూ వదలిపెట్టేది లేదు. ఇందుకోసం నిరంతరం నిఘా ఏర్పాటు చేశాం. చెక్‌పోస్టుల్లో తనిఖీలు విస్తృతం చేస్తున్నాం.
– పోలీసు కమిషనర్ ఎం.శ్రీనివాసులు

మార్పు కనిపిస్తే రౌడీషీట్ తొలగిస్తాం

- సత్ప్రవర్తన కలిగి జీవించాలి
- రామగుండం సీపీ శ్రీనివాసులు



మాట్లాడుతున్న సీపీ శ్రీనివాసులు

మంచిర్యాలక్రైం: రౌడీషీటర్లు సత్ప్రవర్తన కలిగి జీవించాలని, మార్పు కనిపిస్తే రౌడీషీట్ తొలగిస్తామని రామగుండం పోలీసు కమిషనర్ ఎం.శ్రీనివాసులు అన్నారు. పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో జిల్లాలోని రౌడీషీటర్లు, సస్పెక్ట్‌షీట్ కలిగి ఉన్న వారికి బుధవారం స్థానిక పోలీసుస్టేషన్ కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యక్తిగతంగా వారి ప్రస్తుత జీవన విధానం, రౌడీషీట్ ఎందుకు పెట్టారు, కుటుంబ పరిస్థితులు, సమాజంలో రౌడీషీటర్లకు ఉన్న విలువపై అడిగి తెలుసుకున్నారు. అనంతరం సీపీ మాట్లాడుతూ చట్టం ఎవరికీ చుట్టం కాదని, నేరం చేసిన వారికి శిక్ష పడుతుందని అన్నారు. ఎప్పుడో తెలిసో తెలియకనో తప్పు చేసి ఇప్పుడు సమాజంలో రౌడీగా ముద్ర వేసుకుని విలువ లేని బతుకు బతుకున్నారని, కుటుంబంలో ఎన్నో ఇబ్బందులు, మనశ్శాంతి లేని జీవితాలు గడుపుతున్నారని తెలిపారు. జిల్లాలో 218మంది నేర చరిత్ర కలిగిన రౌడీషీటర్లు ఉన్నారని, వీరిపై నిరంతరం నిఘా ఉంటుందని, నేరం చేసిన వారు పోలీసుల నుంచి తప్పించుకోలేరని, శాస్త్రీయ దర్యాప్తు పద్ధతుల్లో విచారణ ఉంటుందని చెప్పారు. భూకబ్జాలు, ప్రజలను బెదిరింపులకు పాల్పడుతూ చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే సహించేది లేదని, ఎంతటి వారైనా ఉపేక్షించబోమని హెచ్చరించారు. పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో ఎవరైనా అరాచకాలకు పాల్పడితే చర్యలు తప్పవని అన్నారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల డీసీపీ అశోక్‌కుమార్, సీఐ బన్సీలాల్, ట్రాఫిక్ సీఐ నరేష్‌కుమార్ ఎస్సైలు పాల్గొన్నారు.

పెద్దపల్లి ఎంపీ సీటు గెలవడం ఖాయం

- బీజేపీ ఎంపీ అభ్యర్థి గోమాసే శ్రీనివాస్
- బెల్లంపల్లిలో ఎన్నికల ప్రచారం ప్రారంభం



శ్రీరాంపూర్: కార్మికులతో శ్రీనివాస్ కరచాలనం

బెల్లంపల్లి: పార్లమెంటు ఎన్నికల్లో పెద్దపల్లి లోక్‌సభ స్థానాన్ని బీజేపీ గెలవడం ఖాయమని ఆ పార్టీ అభ్యర్థి గోమాసే శ్రీనివాస్ అన్నారు. బుధవారం బెల్లంపల్లి బజారు ఏరియాలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్‌తో కలిసి శ్రీనివాస్ ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. అనంతరం అగర్వాల్ భవన్‌లో పార్టీ శ్రేణులతో ఎన్నికల సన్నాహాక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గోమాసే శ్రీనివాస్ మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దేశాన్ని అభివృద్ధి పథంలోకి తీసుకెళ్తోందని అన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ మాట్లాడుతూ కుటుంబ పాలన అంతం కావాలని కేసీఆర్ ప్రభుత్వాన్ని ప్రజలు గద్దె దించితే జిల్లాలో మరో కుటుంబం కుటుంబ పాలనకు కాచుకుని చూస్తోందని విమర్శించారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శి పట్టి వెంకటకృష్ణ, జిల్లా కార్యదర్శి మాసు రజని, బెల్లంపల్లి అసెంబ్లీ నియోజకవర్గ ఇంచార్జి అన్నపూర్ణ సుదర్శన్‌గౌడ్, నియోజకవర్గ కన్వీనర్ రాచర్ల సంతోష్‌కుమార్, అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

బీజేపీ గెలిస్తే సమస్యల పరిష్కారం

శ్రీరాంపూర్: బీజేపీ గెలిస్తే కార్మికుల సమస్యలు పరిష్కారమవుతాయని ఆ పార్టీ పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి గోమాసే శ్రీనివాస్ తెలిపారు. బుధవారం ఆయన ఆర్కే 6 గనిపై కార్మికులను కలిసి మాట్లాడారు. రాబోయే ఎన్నికల్లో పెద్దపల్లి ఎంపీగా తనను గెలిపించాలని కోరారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు సత్రం రమేశ్, పట్టణ ఇంచార్జి పీ.కమలాకర్‌రావు, నాయకులు కుర్రె చక్రవర్తి, రమేశ్, కాదాసు భీమయ్య, మామిడిశెట్టి మహేశ్ పాల్గొన్నారు.

సమావేశానికి సీనియర్లు డుమ్మా

బెల్లంపల్లి: పార్లమెంటు ఎన్నికల వేళ బీజేపీ నాయకుల్లో అసంతృప్తి బయటపడింది. బెల్లంపల్లిలో బుధవారం నిర్వహించిన బీజేపీ ఎన్నికల సన్నాహక సమావేశానికి పార్టీ సీనియర్ నాయకులు డుమ్మా కొట్టారు. మాజీ ఎమ్మెల్యే అమురాజుల శ్రీదేవి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొయ్యల ఏమాజీ, నాయకులు పుల్లం తిరుపతి, బి.కేశవరెడ్డి, కే.గోవర్ధన్, కోడి రమేష్, మండల స్థాయి నాయకులు గైర్హాజరు కావడం చర్చనీయాంశంగా మారింది. పార్టీ జిల్లా అధ్యక్షుడు అనుసరిస్తున్న ఒంటెద్దు పోకడలతోనే దూరంగా ఉంటున్నట్లు తెలుస్తోంది. సీనియర్లకు ప్రాధాన్యత కల్పించకపోవడం, జూనియర్లకు జిల్లా స్థాయి పదవి కట్టబెట్టడం, ఎన్నికల ప్రచార సమావేశాల్లో హోదాకు తగిన విధంగా గౌరవం ఇవ్వకపోవడం వంటి అంశాలతో అలక వహించినట్లు చెబుతున్నారు.

నెర్రెలు బారుతున్న నేల

- సాగు నీరందక రైతుల ఆందోళన
- పంటపొలాలు పశువులకు వదిలేస్తున్న రైతులు
- విద్యుత్ కోతలు, అడుగంటుతున్న భూగర్భజలాలు



జైపూర్ మండలం కుందారంలో ఎండిపోయి నెర్రెలు బారిన వరిపొలం

మంచిర్యాలఅగ్రికల్చర్: సాగు నీరందక పంట పొలాలు నెర్రెలు బారుతున్నాయి. ఎండలు మండిపోతుండడంతో భూగర్భ జలాలు అడుగంటుతున్నాయి. పొట్ట దశలో ఉన్న వరి పొలాలు బీటలు వారుతుండడంతో అన్నదాతలు కన్నీటి పర్యంతం అవుతున్నారు. విధిలేని పరిస్థితుల్లో కొందరు ఆశలు వదిలేసుకుని పొలాలు పశువులకు వదిలేస్తుండగా.. మరికొందరు పంటను కాపాడుకునేందుకు పాట్లు పడతున్నారు. రాత్రివేళల్లోనే విద్యుత్ సరఫరా ఉంటుండడంతో పొలం వద్దే ఉండి నీరందిస్తున్నారు. నాలుగైదు గంటల కంటే ఎక్కువగా కరెంటు ఉండడం లేదని రైతులు వాపోతున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈసారి వరి సాగు చేసిన రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం పంట పొట్ట, గొలుసు దశలో ఉంది. గరిష్ట ఉష్ణోగ్రతలు 40డిగ్రీలకు చేరడంతో చెరువులు, కుంటలు, బోరు బావులు అడుగంటుతున్నాయి. గతంలో 250 అడుగుల లోతులో కనిపించిన భూగర్భ జలాలు ప్రస్తుతం 500 అడుగుల లోతుకు వేసినా కనిపించడం లేదు. జైపూర్, కోటపల్లి, మందమర్రి, తాండూర్, జన్నారం, కన్నెపల్లి మండలాల్లో భూగర్భ జలాలు గత ఏడాది కంటే రెండు నుంచి మూడు మీటర్ల లోతుకు పడిపోయాయి. ఇప్పటికే మెజార్టీ బోర్లు ఎండిపోయాయి. పంటలు కాపాడుకునేందుకు పలువురు రైతులు బోర్లు వేస్తున్నారు. కడెం ప్రాజెక్టుకు క్రాప్ హాలిడే ప్రకటించడంతో సాగు విస్తీర్ణం తగ్గింది. మేడిగడ్డ, అన్నారం పిల్లర్ల డ్యామేజీతో గోదావరిలో నీటి నిల్వలు లేకుండాపోయాయి. బోరుబావులు ఉన్న రైతులు సాగునీరు అందించేందుకు అవస్థలు పడుతున్నారు. కొన్నిచోట్ల లో ఓల్టేజీతో ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతున్నాయి. రోజుల తరబడి మరమ్మతులకు నోచకోక నీటితడులు అందడం లేదు. ప్రస్తుతం జిల్లాలో గూడెం ఎత్తిపోతలు, కాలువల ద్వారా దండేపల్లి, లక్సెట్టిపేట, హాజీపూర్ మండలాల్లో పంటలకు సాగునీరు అందుతోంది. మరో నెల రోజులు నీటితడులు అందించేందుకు రైతులు అవస్థలు పడక తప్పేలా లేదు.

నాలుగైదు గంటలే కరెంటు..



నేను మూడు ఎకరాల్లో వరి సాగు చేసిన. పంటకు నీరందక రెండు ఎకరాలు నెర్రలు బారి ఎండిపోతంది. నాలుగైదు గంటల కంటే ఎక్కువగా కరెంట్ ఉండడం లేదు. కరెంటు ఉన్న కొన్ని గంటలు నీళ్లు పెడితే పొలం చివరిదాకా వెళ్లక ముందే కరెంటు పోతంది. మళ్లీ కరెంటు వచ్చేసరికి పారిన నీళ్లు భూమిలోనే ఇంకిపోతున్నాయి. అద్దుమ రాత్రి కరెంటు ఇస్తరు. పొద్దగాలనే పోతుంది. పొద్దంతా రిపేర్లు అంటరు. కరెంటోళ్లను అడుగుతే మీదటికెళ్లే కరెంటు పోతుంది అంటున్నారు. పొలం ఎండిపోయి నష్టపోవుడు అయింది.
– తోకల లింగయ్య, కుందారం, జైపూర్

నీళ్లు అందుతలేవు..

పొలం పొట్టకు వచ్చింది. మూడున్నర ఎకరాల పొలం రెండకరాల వరకు నీరిందించే వరకే బోర్ల నీళ్లు అడుగంటుతున్నయి. మళ్లీ నాలుగు గంటల పాటు ఎదురు చూసి బోరు ఆన్ చేయాల్సి వస్తుంది. మండుతున్న ఎండలకు పొలం పూర్తిగా తడవడం లేదు. ఆర ఎకరం వరకు ఎండిపోతుంది.
– బి.శ్రీనివాస్, కుందారం, జైపూర్

జిల్లాలో సాగైన పంటలు

పంట	ఎకరాలు
వరి	1,00,998.11
మొక్కజొన్న	3,137.14
పెసలు	204.35
పల్లి	176.17
జొన్న	75.16
ఇతర పంటలు	269.36
మొత్తం	1,04,860.10

ఆస్తుల జప్తు.. భవనాలకు తాళాలు



సూపర్ మార్కెట్‌కు తాళం వేస్తున్న అధికారులు



మున్సిపాల్టీ ఏర్పాటు చేసిన జప్తు వాహనం

- ఆస్తి పన్ను వసూలుకు మున్సిపల్ సిబ్బంది కొరడా
- ఇక మిగిలింది నాలుగు రోజులే..

మంచిర్యాలటౌన్: మంచిర్యాల మున్సిపల్ అధికారులు ఆలస్యంగానైనా మేల్కొన్నారు. బకాయిదారుల నుంచి ఆస్తి పన్ను వసూలుకు కొరడా ఝళిపిస్తున్నారు. భారీగా ఆస్తిపన్ను బకాయి పడిన వారి ఆస్తుల జప్తు, భవనాలకు తాళాలు వేస్తున్నారు. పాత బకాయిల వసూలుకు ప్రభుత్వం పన్నుపై వడ్డీలో 90శాతం మాఫీ ప్రకటించింది. అయినా చాలా మంది ముందుకు రాలేదు. బకాయిలు రూ.కోట్లలో పేరుకుపోవడం, ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగింపునకు నాలుగు రోజులే ఉండడంతో అధికారులు మేల్కొన్నారు. ఆస్తి పన్ను చెల్లించని, పెద్దమొత్తంలో బకాయి పడిన వారి ఆస్తి జప్తునకు ఓ వాహనాన్ని ఏర్పాటు చేశారు. పట్టణంలోని మోర్ సూపర్‌మార్కెట్ భవనం ఆస్తి పన్ను రూ.1.41లక్షలు బకాయి ఉండగా చెల్లించకపోవడంతో అధికారులు బుధవారం తాళం వేశారు. మరికొన్ని దుకాణాల భవన యజమానులు రూ.లక్షల్లో పన్ను చెల్లించాల్సి ఉండగా ఒక రోజు గడువు విధించారు. ఆస్తి పన్ను చెల్లించని పక్షంలో చట్ట ప్రకారం చర్యలుంటాయని మున్సిపల్ మేనేజర్ విజయ్‌కుమార్, రెవెన్యూ ఆఫీసర్ శ్రీనివాస్‌రెడ్డి హెచ్చరించారు.

నాలుగు రోజుల్లోనే..

మున్సిపాలిటీలో 26,741 ఇళ్లు ఉన్నాయి. ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.10.62 కోట్ల పన్నులు వసూలు చేయాల్సి ఉండగా, గతంలో పెండింగ్‌లో ఉన్న బకాయిలతో కలిపి రూ.17.72 కోట్లు డిమాండ్ ఉంది. ఈ నెల 27వరకు రూ.10.62 కోట్లు వసూలు చేయగా.. ఇంకా రూ.7.09 కోట్లు బకాయి పడ్డాయి. మిగిలిన నాలుగు రోజుల్లోనే ఇన్ని కోట్ల బకాయిలు వసూలు చేయడం మున్సిపల్ అధికారులకు కత్తి మీద సాము వంటిదే. పన్ను బకాయిలు అధికంగా ఉన్న వారి ఆస్తుల జప్తునకు ఒక వాహనాన్ని ఏర్పాటు చేయగా, బకాయిలు చెల్లించని మొండిఘటాల ఆస్తులకు తాళం వేస్తున్నారు. కొద్ది రోజుల ముందు నుంచే వసూలుపై దృష్టి సారించి ఉంటే 90శాతానికి పైగా వసూలయ్యేవనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది.

కాంగ్రెస్ గూటికి టీబీజీకేఎస్ మాజీ నేతలు?

- రెండ్రోజుల్లో చేరికలకు సిద్ధం
- హైదరాబాద్‌లో మకాం వేసిన నాయకులు

శ్రీరాంపూర్: సింగరేణిలో మాజీ టీబీజీకేఎస్ ముఖ్యనేతలు కాంగ్రెస్ పార్టీలో చేరికకు సిద్ధమైనట్లు తెలిసింది. గత గుర్తింపు సంఘం ఎన్నికలకు ముందు అప్పటి టీబీజీకేఎస్ అధ్యక్షుడు బి.వెంకట్రావు, ప్రధాన కార్యదర్శి మిర్యాల రాజిరెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ కెంగర్ల మల్లయ్య ఆ సంఘం పదవులు, సభ్యత్వానికి రాజీనామా చేశారు. అప్పటి నుంచి ఏ సంఘంలో చేరకుండా వేచి చూస్తున్నారు. వీరిలో రాజిరెడ్డి మాత్రం ఎన్నికల తర్వాత నుంచి తిరిగి టీబీజీకేఎస్‌లో కొనసాగుతున్నారు. మిగతా ఇద్దరి రాజీనామాలను ఈ నెల 23న గోదావరిఖనిలో జరిగిన వర్కింగ్ కమిటీ సమావేశంలో ఆమోదించారు. దీంతో ఆ ఇద్దరు కాంగ్రెస్‌లో చేరబోతున్నారని తెలిసింది. పార్టీలో చేరిక తర్వాత అనుబంధ కార్మిక సంఘం ఐఎన్టీయూసీలో ముఖ్య పదవులు ఇచ్చే అవకాశం ఉందని తెలిసింది. ప్రస్తుతం ఇద్దరు నేతలు రెండ్రోజులుగా హైదరాబాద్‌లో చేరికల కోసం మకాం వేసినట్లు తెలిసింది. రేపు లేదా ఎల్లుండి వీరి చేరిక ఉంటుందని యూనియన్ నేతలు భావిస్తున్నారు.

ఎమ్మెల్యే వివేక్ చొరవ..

పెద్దపల్లి ఎంపీ అభ్యర్థిగా కాంగ్రెస్ నుంచి టికెట్ లభించిన తన తనయుడు వంశీకృష్ణ గెలుపు కోసం చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి ఆ ఇద్దరు నేతలను పార్టీలో చేర్పించడానికి చొరవ చూపిస్తున్నట్లు తెలిసింది. పెద్దపల్లి పార్లమెంటు నియోజకవర్గ పరిధిలో గెలుపోటములను ప్రభావితం చేసే కార్మిక ఓటర్లను ప్రభావితం చేయగలిగిన నాయకులను ఈ సమయంలో పార్టీలో చేర్పించకుంటే లాభం చేకూరుస్తుందనే ఉద్దేశంతో వీరి చేరికలపై ఆసక్తి చూపిస్తున్నట్లు తెలిసింది. కాగా, ఈ ఇద్దరు నాయకులు ఇప్పటికే రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, డి.శ్రీధర్‌బాబులను పలుమార్లు కలిసి చేరికకు సముఖత వ్యక్తం చేశారు. పార్టీలో గానీ ఐఎన్టీయూసీలో గానీ తమకు సముచిత స్థానం కల్పించాలని కోరినట్లు తెలిసింది. ఎంపీ ఎన్నికల సమయం కావడంతో పదవులపై పార్టీ నాయకత్వం, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో వివేక్ చర్చిస్తున్నట్లు తెలిసింది. వీరి చేరిక వల్ల ఎలాంటి ఇబ్బందులు ఉండవంటూ ఐఎన్టీయూసీ సెక్రెటరీ జనరల్ బీ.జనక్‌ప్రసాద్‌ను కూడా వివేక్ బుజ్జగిస్తున్నారని తెలుస్తోంది. సీఎం రేవంత్‌రెడ్డి, డెప్యూటీ సీఎం భట్టి విక్రమార్కలు ఎప్పుడు సమయం ఇస్తే అప్పుడు వీరు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకోనున్నట్లు తెలిసింది.

సల్పాలవాగు అడవిలో మంటలు



మంటలు ఆర్పుతున్న అటవీ శాఖ సిబ్బంది

కాసిపేట: మండలంలోని దేవాపూర్ సల్పాలవాగు అడవిలో బుధవారం మధ్యాహ్నం మంట లు చెలరేగాయి. ముత్యంపల్లి సెక్షన్ పరిధిలోని దేవాపూర్ ప్రధాన రోడ్డుకు సమీపంలో మంటలు కనిపించడంతో వాహనదారులు అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించారు. డెప్యూటీ రేంజ్ అధికారి ప్రవీణ్‌నాయక్ ఆధ్వర్యంలో సిబ్బంది అక్కడికి చేరుకుని మంటల ను ఆర్పి వేశారు. అటవీలో పనిచేస్తున్న ఈజీ ఎస్ కూలీలు, లేక మరెవరో నిప్పు పడేసి ఉంటారని, వేసవి కాలం కావడంతోపాటు టేకు చెట్ల ఆకులు ఎక్కువగా ఉండడంతో మంటలు వ్యాపించినట్లు అటవీ అధికారులు తెలిపారు.

క్లుప్తంగా

సర్వీస్ వైర్ చోరీ

జన్నారం: మండలంలోని పలు గ్రామాల్లో విద్యుత్ మోటార్లకు అమర్చిన సర్వీస్ వైర్ చోరీకి గురికావడం రైతులను కలవరపెడుతోంది. ఇటీవల బాదంపల్లిలో సుమారు 500 మీటర్ల వైర్ చోరీకి గురైంది. తాజాగా మంగళవారం రాత్రి కలమడుగులో రైతులు బొంతన మల్లేశ్, జక్కుల గౌరయ్య, గట్టి విష్ణుమూర్తి, మేకల మల్లేశ్, బాద లక్ష్మి, జక్కుల నరేష్, సంగ రాజన్న, యాదగిరి రాంమోహన్‌రావుకు చెందిన సుమారు రూ.లక్ష విలువైన సర్వీస్ వైర్ చోరీకి గురైంది. అధికారులు దృష్టి సారించి సర్వీస్ వైర్ దొంగలను గుర్తించి తమకు న్యాయం చేయాలని రైతులు కోరుతున్నారు.

ఇరువర్గాలపై కేసు

సిర్పూర్(టి): మహారాష్ట్ర నుంచి హైదరాబాద్‌కు ఓ కంటైనర్ వ్యాన్‌లో 19 పశువులను తరలిస్తున్న వాహనాన్ని మండల కేంద్రంలోని డొనల్ ప్రాంతంలో సోమవారం రాత్రి యువకులు అడ్డుకున్నారు. ఈ ఘటనలో మరో వర్గం వారు వచ్చి నిరాకరించడంతో ఇరువర్గాల మధ్య తీవ్ర వాగ్వివాదం చోటు చేసుకుంది. దీంతో ఇరువర్గాలకు చెందిన మొత్తం 24 మందిపై కేసులు నమోదు చేసినట్లు సిర్పూర్(టి) ఎస్సై డీకొండ రమేశ్ తెలిపారు.

పరారీలో ఉన్న నిందితుడి అరెస్ట్

మంచిర్యాలక్రైం: రోడ్డు ప్రమాదం కేసులో కోర్టుకు హాజరు కాకుండా తప్పించుకు తిరుగుతున్న ఓ నిందితుడిని బుధవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ భన్సీలాల్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని ఏసీసీ సమీపంలో 2017 మే 26న హమాలీవాడకు చెందిన గుర్రాల శంకర్ మంచిర్యాల నుంచి గద్దెరాగడి వైపు ఆటోలో వెళ్తుండగా డ్రైవర్ ముప్పాళ్ల సమ్మయ్య అజాగ్రత్తగా ఆటో నడిపి ప్రమాదానికి కారణమయ్యాడు. ఈ ప్రమాదంలో శంకర్‌కు తీవ్ర గాయలయ్యాయి. ప్రమాదానికి కారణమైన సమ్మయ్యపై కేసు నమోదు కాగా కోర్టుకు హాజరు కాకుండా తప్పించుకు తిరుగుతుండడంతో కోర్టు నాన్ బెయిల్ వారంట్ జారీ చేసింది. నిందితుడిని అరెస్ట్ చేసి లక్సెట్టిపేట జైలుకు తరలించినట్లు సీఐ తెలిపారు.

గుడుంబా పట్టివేత

దండేపల్లి: మండలంలోని లింగాపూర్‌కు చెందిన జర్పుల గణేశ్ గుడుంబా తరలిస్తుండగా బుధవారం పట్టుకున్నట్లు ఎస్సై స్వరూప్‌రాజ్ తెలిపారు. ఎన్నికల తనిఖీల్లో భాగంగా దండేపల్లి సమీపంలో వాహనాలు తనిఖీ చేస్తుండగా స్కూటీపై వస్తున్న గణేశ్‌ను ఆపి తనిఖీ చేయగా 5 లీటర్ల గుడుంబా లభించింది. నిందితుడిని అదుపులోకి తీసుకుని గుడుంబా, స్కూటీని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ప్రమాదాల నివారణ ప్రతీఒక్కరి బాధ్యత

కాసిపేట: ప్రమాదాల నివారణ ప్రతిఒక్కరి బాధ్యత అని, కార్మికులు రక్షణతో కూడిన విధులు నిర్వర్తించాలని ఏరియా రక్షణాధికారి ఎం.రవీందర్ సూచించారు. బుధవారం మందమర్రి ఏరియా కాసిపేట-2 గనిపై రక్షణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ ఉద్యోగి ఏకాగ్రతతో విధులు నిర్వహించాలన్నారు. ప్రమాదరహిత ఉత్పత్తి ప్రధాన కర్తవ్యమన్నారు. కేకే గ్రూపు ఏజెంట్ రామదాసు, గని మేనేజర్ లక్ష్మీనారాయణ, రక్షణాధికారి సంతోష్‌రావు, ఏరియా ఇంజనీర్లు పాల్గొన్నారు.

ఒకరిపై కేసు నమోదు

ఆదిలాబాద్‌టౌన్: ద్విచక్ర వాహనాన్ని ట్రాక్టర్‌తో ఢీకొట్టిన కేసులో ట్రాక్టర్ డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు టూటౌన్ సీఐ అశోక్ తెలిపారు. ఈ నెల 24న మధ్యాహ్నం 2 గంటల సమయంలో మహాలక్ష్మివాడకు చెందిన నరేష్ ద్విచక్ర వాహనంపై పట్టణంలోని తిర్పెల్లి నుంచి మహాలక్ష్మివాడకు వెళ్తున్నాడు. ఈ క్రమంలో ట్రాక్టర్ డ్రైవర్ వెనుక నుంచి ఢీకొట్టాడు. బాధితుడు ఆస్పత్రిలో చికిత్స పొందిన అనంతరం బుధవారం ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు సీఐ పేర్కొన్నారు. ట్రాక్టర్ డ్రైవర్ పరారీలో ఉన్నట్లు వివరించారు.

నిప్పుతో జాగ్రత్త..!

- చిన్న తప్పిదాలతోనే అగ్ని ప్రమాదాలు
- అప్రమత్తతతోనే నివారణ

మంచిర్యాలక్రైం: చిన్నచిన్న తప్పిదాలతోనే నిత్యం ఏదో ఒకచోట అగ్ని ప్రమాదాలు సంభవిస్తున్నాయి. దీంతో ఆస్తి, ప్రాణనష్టం జరుగుతున్నాయి. అగ్ని ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవడం ఎంతో మేలు. పట్టణాల్లో జరిగే 70 శాతం అగ్ని ప్రమాదాలు విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ వల్లే జరుగుతున్నాయి. దీనికి కారణం నాసిరకం విద్యుత్ తీగలు వాడడమే. తక్కువ ధరకు కొనుగోలు చేసిన తీగలతో ఓవర్ లోడ్ విద్యుత్ సరఫరా జరిగినప్పుడు షార్ట్‌సర్క్యూట్ ఏర్పడుతోంది. తీగలు తెగినప్పుడు అతుకులు వేయడంతో ఓవర్‌లోడ్ విద్యుత్ సరఫర అయినప్పుడు ఆప్రాంతంలో వేడికి కరిగిపోయి షార్ట్ సర్క్యూట్ ఏర్పడి మంటలు చెలరేగే అవకాశం ఉంది.

గ్రామీణ ప్రాంతాల్లో ఇలా....

వేసవి కాలంలో గ్రామీణ ప్రాంతాల్లో ఇళ్లమధ్యలో గడ్డివాములు, పత్తి కట్టెలు వేయడం వలన అగ్ని ప్రమాదాలు ఎక్కువగా జరుగుతుంటాయి. ఇవి ఇళ్ల మధ్యనే వేయడం ప్రమాదకరమన్న విషయాన్ని ఎవరూ గుర్తించడం లేదు. ఎండల తీవ్రతకు గడ్డివాములకు తొందరగా నిప్పంటుకునే అవకాశం ఉంది. పల్లెల్లో ఇంటి ఆవరణలోనే కట్టెల పొయ్యి వెలిగిస్తుంటారు. దీంతో నిప్పురవ్వలు ఎగిసి గడ్డివాములపై పడి ప్రమాదాలు చోటు చేసుకుంటాయి. ఎవరైనా బీడీలు, సిగరెట్లు తాగి అక్కడే పడేసినా ప్రమాదమే. అందుకే గడ్డివాములు ఊరికి దూరంగా ఏర్పాటు చేసుకుంటే మంచిది.

పత్తి నిల్వలు పదిలం...

ఎత్తి కట్టెలకు, నిలువ ఉన్న పత్తికి మంటలు తేలికగా అంటుకునే స్వభావం ఉంటుంది. పత్తి నిల్వచేసిన ప్రాంతంలో విద్యుత్ సరఫరా లేకుండా చూడాలి. జిన్నింగ్ పరిశ్రమల్లో పత్తి కుప్పలు(గంజి) మధ్య రెండు నుంచి మూడు మీటర్ల మధ్య దూరం ఉంచాలి. ఒకవేళ ప్రమాదం జరిగినా ఒకే కుప్ప కాలిపోతుంది. దీంతో నష్టం తక్కువ వస్తుంది. కానీ ఈ నిబంధనలు ఎవరు పాటించడం లేదు.

అగ్ని ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలు



కన్నెపెల్లి మండలం మెట్‌పెల్లిలో షార్ట్‌సర్క్యూట్‌తో దగ్ధమైన మోర్ల భీమయ్య ఇల్లు (ఫైల్)

- పరిశ్రమలు, అపార్టుమెంటు, వాణిజ్యపరమైన స్థలాలు, హోటళ్లు, బార్లు, సినిమా థియేటర్లు, కల్యాణ మండపాలు, తదితర ప్రదేశాల్లో అగ్నిమాపక పరికరాలు తప్పనిసరిగా ఉంచుకోవాలి.
- ఇంట్లో ఇసుక బకెట్లు ఉంచితే గ్యాస్ లికేజీ ఏర్పడినప్పుడు మంటలు ఆర్పేందుకు నీళ్లతో పాటు ఇసుక కూడా వాడొచ్చు.
- పెట్రోల్, డీజిల్, ఆయిల్, గ్రీజ్ తదితర చమురు పదార్థాలు కాలుతున్నప్పుడు నీళ్లు పోయకూడదు. అల్యూమినియం, సల్ఫేట్, సోడియం బైకార్బోనైట్ మిశ్రమం గల నురుగు గల పరికరాన్ని ఉపయోగించాలి.
- విద్యుత్‌తో అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు కార్బన్ డయాక్సైడ్ గ్యాస్ పరికరాన్ని వాడాలి. నీళ్లు ఉపయోగిస్తే షాక్ వస్తుంది.
- వంటగదికి కిటికీలు, వెంటిలేటర్లు ఉంటే గ్యాస్ లీకేజీ ఏర్పడినా బయటకు వెళ్లిపోతుంది. వంటగదిలో దేవుళ్ల ఫొటోలు ఉంచకూడదు.

జిల్లాలో ఇటీవల జరిగిన భారీ అగ్ని ప్రమాదాలు

- సీసీసీ నస్పూర్‌లో ఈ నెల 2న రాజా ఎలక్ట్రానిక్స్ షాపులో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం సంభవించింది. రూ.10 లక్షల ఆస్తినష్టం జరిగింది.
- గతేడాది డిసెంబర్ 22న కన్నెపెల్లి మండలం మెట్‌పల్లిలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మోర్ల భీమయ్య పూరిగుడిసె దగ్ధమైంది. పత్తి, వరి పంట విక్రయించగా వచ్చిన రూ.8 లక్షల 80వేల నగదు, 11తులాల బంగారం, 78 తులాల వెండి కాలి పోయింది.

నిర్లక్ష్యం వల్లే..



చిన్నపాటి నిర్లక్ష్యంవల్లే అగ్నిప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. అగ్ని ప్రమాదాల నివారణ, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రతీ శుక్రవారం ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. చిన్నపాటి జాగ్రత్తలు పాటిస్తే అగ్ని ప్రమాదాలను నివారించవచ్చు.

– అజయ్‌బాబు, జిల్లా ఫైర్ అధికారి, మంచిర్యాల

జిల్లాలో నాలుగేళ్లలో జరిగిన అగ్ని ప్రమాదాలు			జిల్లాలోని ఫైర్‌స్టేషన్ల ఫోన్ నంబర్లు		
సంవత్సరం	అగ్ని ప్రమాదాలు	ఆస్తినష్టం	అగ్నిమాపక కేంద్రం	అధికారిసెల్‌నంబర్	ఫైర్‌స్టేషన్ ల్యాండ్/మొబైల్ నంబర్
2020–2021	184	రూ. 2కోట్లు	మంచిర్యాల	8712699195	08736 252101/8712699194
2021–2022	124	రూ.88లక్షలు	బెల్లంపల్లి	8712699199	08735 225101/8712699198
2022–2023	152	రూ.1.10కోట్లు	జన్నారం	8712699197	08739 245101/8712699196
2023–2024 మార్చి 13వరకు	158	రూ.1.1కోట్లు	చెన్నూర్	8712699201	08737 242101/8712699200

వేధించిన వారిపై చర్యలు తీసుకోవాలి

జన్నారం: కడెం నీటి పారుదల కార్యాలయంలో టెక్నికల్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న తోకల రాకేశ్‌ను వేధించి ఆత్మహత్యకు కారకులైన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ బుధవారం మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో మంచిర్యాల డీసీపీ అశోక్‌కు వినతిపత్రం అందజేశారు. ఇద్దరు ఉద్యోగుల వేధింపుల వల్లే రాకేశ్ ఆత్మహత్య చేసుకున్నట్లు మరణ వాంగ్మూలం ఇవ్వడమే కాకుండా జన్నారం పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైనా కార్యాలయ సూపరింటెండెంట్ ప్రభాకర్, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్‌పై ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. వెంటనే వారిపై శాఖ పరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి లక్ష్మీనారాయణ, మృతుని సోదరుడు విశేష్ ఉన్నారు.



డీసీపీకి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

అ'పూర్వ' కలయిక



1986–87 పదోతరగతి బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు 38 ఏళ్ల అనంతరం ఒకేచోట కలుసుకున్నారు. జన్నారం మండలం రేండ్లగూడలో జరిగిన నరేశ్ కుమారుడు హరీశ్ వివాహానికి సుదూర ప్రాంతాలలో ఉన్న పూర్వ విద్యార్థులు 40 మంది ఒకే చోట కలుసుకున్నారు. తమ అనుభవాలను పంచుకుని నూతన వధూవరులను ఆశీర్వదించారు.

– జన్నారం

నిందితుడి రిమాండ్

లింగాపూర్: మండలంలోని నద్దంగూడ గ్రామానికి చెందిన జాదవ్ విలాస్‌ను బుధవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు ఈనెల 24న విలాస్ నివాసంలో తనిఖీ చేయగా మద్యం లభించడంతో సీజ్ చేశారు. ఈ నెల 26న వెళ్లి తనిఖీలు నిర్వహించగా దుర్భాషలాడుతూ ఎస్సైపై దాడికి దిగాడు. నిందితుడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

అసైన్డ్ భూమిలో పనులు అడ్డుకున్న అధికారులు

కాసిపేట: సోమగూడెంలో అకెనపల్లి శివారు సర్వే నంబర్ 3పైకి అసైన్డ్ భూమిలో చేపట్టిన పనులను బుధవారం అధికారులు అడ్డుకున్నారు. ఈభూమి వివాదంపై బెల్లంపల్లి ఆర్డీవోకు మంగళవారం కొంతమంది ఫిర్యాదు చేయడంతో విచారణకు వచ్చామని, పనులు నడుస్తుండటంతో అడ్డుకుని సంబంధిత పత్రాలు ఉంటే కార్యాలయంలో చూపించాలని ఎంఆర్ఐ విజయలక్ష్మి తెలిపారు. కబ్జాల నివారణకు ఏర్పాటు చేసిన కమిటీ ఆధ్వర్యంలో నిత్యం ప్రభుత్వ, అసైన్డ్ భూములు పరిశీలిస్తున్నామన్నారు.

ప్రభుత్వం దృష్టికి సింగరేణి సమస్యలు

శ్రీరాంపూర్: సింగరేణి కార్మికుల ప్రధాన సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వ పెద్దలను కలవనున్నట్లు ఐఎన్టీయూసీ శ్రీరాంపూర్ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు జెట్టి శంకర్‌రావు తెలిపారు. బుధవారం నస్పూర్–శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గురువారం ఉదయం సింగరేణి అన్ని ఏరియాల నుంచి ఐఎన్టీయూసీ బ్రాంచి ముఖ్య నేతలు హైదరాబాద్‌కు వెళ్లి రాష్ట్ర మంత్రులు శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సింగరేణి సీఎండీ ఎన్.బలరాంను కలిసి కార్మికుల ప్రధాన డిమాండ్లను వారి దృష్టికి తీసుకెళ్తామన్నారు. సమావేశంలో ఆ యూనియన్ కేంద్ర కమిటీ నాయకులు గరిగే స్వామి, కలవేన శ్యామ్, సీహెచ్ భీంరావు, బ్రాంచ్ నాయకులు ల్యాగల శ్రీనివాస్, పెట్టం శ్రీనివాస్, నర్సింగ్, గోపాల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జెట్టి శంకర్‌రావు

లహరి బస్సుల్లో 10 శాతం రాయితీ

మంచిర్యాలఅర్బన్: ప్రయాణికుల సౌకర్యార్థం లహరి ఏసీ స్లీపర్, ఏసీ స్లీపర్ కమ్ సీటర్ బస్సుల్లో బెర్త్‌లపై 10 శాతం రాయితీ కల్పించినట్లు మంచిర్యాల డీఎం రవీంద్రనాథ్ తెలిపారు. సాధారణ టికెట్ ధరలో ప్రయాణికులు బుక్ చేసుకునే బెర్త్‌లపై 10 శాతం డిస్కౌంట్ కల్పించినట్లు తెలిపారు. లహరీ ఏసీ బస్సులు మంచిర్యాల నుంచి మియాపూర్‌కు ఉదయం 11:30 గంటలకు, రాత్రి 11:20 గంటలకు, మంచిర్యాల నుంచి ఎంజీబీఎస్ మధ్యాహ్నం 2గంటలకు, రాత్రి 11 గంటలకు, లహరి నాన్ ఏసీ బస్సు మంచిర్యాల నుంచి ఎంజీబీఎస్ ఉదయం 4:30 గంటలకు, మధ్యాహ్నం 11 గంటలు, చెన్నూర్ నుంచి ఎంజీబీఎస్‌కు రాత్రి 8గంటలకు, మంచిర్యాల వయా లక్సెట్టిపేట్ మీదుగా మియాపూర్‌కు రాత్రి 11 గంటలకు బస్సులు రాకపోకలు సాగిస్తాయన్నారు. ఎంజీబీఎస్ నుంచి మంచిర్యాలకు ఉదయం 6:30 గంటలకు మియాపూర్ నుంచి మంచిర్యాలకు రాత్రి 8.30 గంటలకు, ఎంజీబీఎస్ నుంచి మంచిర్యాలకు రాత్రి 11 గంటలకు, నాన్‌ఏసీ బస్సు ఎంజీబీఎస్ నుంచి మంచిర్యాలకు ఉదయం 5:15 గంటలకు, మియాపూర్ నుంచి మంచిర్యాలకు ఉదయం 7గంటలకు, ఎంజీబీఎస్ నుంచి మంచిర్యాలకు ఉదయం 11:45 గంటలకు, ఎంజీబీఎస్ వయా చెన్నూర్ మీదుగా మంచిర్యాలకు రాత్రి 9:30 గంటలకు బస్సులు రాకపోకలు సాగిస్తాయని ఆయన పేర్కొన్నారు.

ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలి

బెల్లంపల్లి: ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని ఆర్డీవో హరికృష్ణ అన్నారు. బెల్లంపల్లి శివారు కన్నాల గ్రామ పంచాయతీ పరిధిలోని మంచిర్యాల–చంద్రాపూర్ జాతీయ రహదారిపై జరుగుతున్న రోడ్డు ప్రమాదాలపై బుధవారం ఆర్డీవో అధ్యక్షతన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూటర్న్‌ వద్ద అధిక కాంతిని ఇచ్చే విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని, వాహన దారులకు స్పష్టంగా కనిపించేలా సూచికలు, యాక్సిడెంట్ ఫోర్న్ ఏరియాగా గుర్తిస్తూ హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. యూటర్న్‌ వద్ద ఆర్టీసీ బస్సులు ఆపడాన్ని కట్టడి చేయాలన్నారు. నేషనల్ హైవేను ఆనుకుని ఉన్న మద్యం షాపుల వద్ద , ఆసుపత్రి వద్ద ట్రాఫిక్ ఏర్పడకుండా ఆంక్షలు విధించాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణ లక్ష్యంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో బెల్లంపల్లి మున్సిపల్ కమిషనర్ మల్లారెడ్డి, తహసీల్దార్ కే.వై ప్రసాద్, బెల్లంపల్లి రూరల్ సీఐ అఫ్జలుద్దీన్, ఎంపీడీవో మహేందర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆర్డీవో హరికృష్ణ

ఓబీ లక్ష్యాన్ని పెంచాలి

- డైరెక్టర్ వెంకటేశ్వర్‌రెడ్డి

శ్రీరాంపూర్: ఓపెన్ కాస్ట్‌లో ఓబీ వెలికితీత లక్ష్యాన్ని పెంచాలని సింగరేణి డైరెక్టర్ (ప్రాజెక్ట్ అండ్ ప్లానింగ్) జీ.వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. బుధవారం శ్రీరాంపూర్ ఓపెన్‌కాస్ట్ గని, ఆర్కే7 గనులను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఆర్థిక సంవత్సరం ముగియడానికి ఇంకా కేవలం నాలుగు రోజులే మిగిలి ఉందన్నారు. ఈ నాలుగు రోజుల కాలంలో ఓబీ మరింత అధికంగా తీయడం వలన బొగ్గు అధికంగా వచ్చే అవకాశం ఉందన్నారు. ఇందుకు ఓబీ కాంట్రాక్టర్లు తగిన ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. అనంతరం ఆర్కే 7గనిలో రెండవ సీమ్‌ను తనిఖీ చేశారు. శ్రీరాంపూర్ జీఎం సంజీవరెడ్డి, ఎస్‌వోటూ జీఎం పురుషోత్తం రెడ్డి, ఏరియా ఇంజనీర్ చంద్రశేఖర్ రెడ్డి, ఓసీపీ అధికారి శ్రీనివాస్, ఆర్కే7 గ్రూప్ ఇన్‌చార్జి ఏవీ రెడ్డి, ఓసీపీ మేనేజర్ బ్రహ్మాజీ, తదితరులు పాల్గొన్నారు.

రక్షణతో కూడిన బొగ్గు ఉత్పత్తి చేయాలి

జైపూర్: రక్షణతో కూడిన బొగ్గు ఉత్పత్తి చేయాలని సింగరేణి డైరెక్టర్ ప్లానింగ్ అండ్ ప్రాజెక్ట్స్ జీ.వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. ఇందారం ఓపెన్‌కాస్టు గనిని తనిఖీ చేశారు. ఆయన వెంట ఇందారం ఓపెన్‌కాస్టు ప్రాజెక్టు అధికారి శ్రీనివాస్, గ్రూపు మేనేజర్ వెంకటేశ్వర్లు, గని మేనేజర్ రవికుమార్, ప్రాజెక్టు ఇంజినీర్ రమేశ్, మురళీమోహన్ ఉన్నారు.



ఓసీపీ వ్యూపాయింట్ వద్ద డైరెక్టర్ వెంకటేశ్వర్‌రెడ్డి

నిధులు కేటాయించాలని వినతి

జైపూర్: ముంపు గ్రామానికి నిధులు కేటాయించాలని కోరుతూ జైపూర్ మండలం రామారావుపేట గ్రామస్తులు వెంకటేశ్వర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. గ్రామానికి రెండు వైపులా శ్రీరాంపూర్, ఐకేసీసీపీల డంపు, క్వారీ ఏరియా ఉందని, తీవ్ర కాలుష్య సమస్యలతో ఇబ్బందులు పడుతున్నామన్నారు. గ్రామం నుంచి ఇందారం రాజీవ్ రహదారి వరకు లైటింగ్ ఏర్పాటు చేయాలని, ఇందారం ఫ్లైఓవర్ బ్రిడ్జి నుంచి శ్రీరాంపూర్ ఓసీపీ చెక్‌పోస్ట్ వరకు బీటీ రోడ్డు, అంతర్గత సీసీ రోడ్లు నిర్మించాలని కోరారు. మాజీ ప్రజాప్రతినిధులు నామాల శ్రీనివాస్, ముదాం రమేశ్ పాల్గొన్నారు.

ఐదు తెగల ఆదివాసీలను గుర్తించాలి

ఇంద్రవెల్లి: ఆదివాసీలోని పర్ధాన్, తోటి, నాయక్‌పోడ్, అంద్, కొలాం గిరిజనులను ఆయా రాజకీయ పార్టీలు గుర్తించి న్యాయం చేయాలని ఐదు తెగల కార్యాచరణ కమిటీ పెద్దలు డిమాండ్ చేశారు. మండలంలోని అమరవీరుల స్తూపం వద్ద బుధవారం సమావేశమయ్యారు. ముందుగా అమరులకు నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడారు. ఆదిలాబాద్ పార్లమెంట్ పరిధిలో ఐదు తెగల ఆదివాసీ ఓటర్లు సుమారు రెండు లక్షలకు పైగా ఉన్నట్లు తెలిపారు. అయితే రాజకీయ పరంగా ఇప్పటి వరకు తమను ఏ పార్టీ గుర్తించలేదన్నారు. ఇప్పటికైనా గుర్తించకపోతే భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామని తీర్మానం చేశారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా పరిధిలోని ఐదు తెగల సంఘాల నాయకులు ఆర్క ఖమ్ము, దుర్వ నగేశ్, వసంత్ రావ్, అశోక్, భీముడు, పాండురంగ్, రమేశ్, వెంకటేశ్, తిరుపతి తదితరులున్నారు.



నినాదాలు చేస్తున్న ఆదివాసీ తెగల పెద్దలు

అధికారులు బాధ్యతతో పనిచేయాలి

- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజర్షిషా
- ఆదిలాబాద్ లోక్‌సభ నియోజకవర్గ అధికారుల సమావేశం

ఆదిలాబాద్‌టౌన్: జిల్లాలో జరిగే పార్లమెంటు ఎన్నికలను స్వేచ్ఛాయుత వాతావరణంలో నిర్వహించేందుకు ఎన్నికల విధులు నిర్వహించే అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. బుధవారం ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ఆదిలాబాద్, బోథ్, నిర్మల్, ముథోల్, ఖానాపూర్, ఆసిఫాబాద్, సిర్పూర్(టి) అసెంబ్లీ సెగ్మెంట్ల పరిధిలోని ఏఆర్వో, ఎస్‌డీపీలతో కోఆర్డినేషన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో మొత్తం 2,111 పోలింగ్ కేంద్రాలు, బ్యాలెట్ యూనిట్స్ 2,638 కంట్రోల్ యూనిట్స్ 2,638, వీవీప్యాట్స్ 2,908, మొబైల్ కనెక్టివిటీ 2,039 ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. షాడో పోలింగ్ కేంద్రాలు సిర్పూర్‌లో 11 , ఆసిఫాబాద్‌లో 28, ఖానాపూర్‌లో 9, ఆదిలాబాద్‌లో 9, బోథ్‌లో 14, నిర్మల్‌లో 1 ఉన్నాయన్నారు. పోలింగ్ సిబ్బందికి ఏప్రిల్ 3, 4 తేదీలలో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఎన్నికల విధుల్లో ఉన్న ప్రతిఒక్కరూ ఫారం 12డి ఉపయోగించాలన్నారు. సెక్టోరల్ అధికారులకు టీంవైజ్‌గా శిక్షణ ఇవ్వాలన్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద గట్టి నిఘా ఏర్పాటు చేయాలన్నారు. ఎస్పీ గౌస్ ఆలం మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఆరు అంతర్రాష్ట్ర చెక్ పోస్టులు, రెండు అంతర్ జిల్లా చెక్ పోస్టులను ఏర్పాటు చేసి నిరంతరం తనిఖీ చేస్తున్నామన్నారు. ఎలాంటి సిగ్నల్ వ్యవస్థ లేని షాడో పోలింగ్ స్టేషన్ ప్రాంతాలను గుర్తించి కమ్యూనికేషన్ వ్యవస్థను పటిష్టం చేసేలా వీహెచ్‌ఎఫ్ సెట్లను ఉపయోగించాలన్నారు. ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా, ఆసిఫాబాద్ అదనపు కలెక్టర్ దీపక్ తివారీ, ట్రెయినీ కలెక్టర్ వికాస్ మహతో, నిర్మల్ అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, ఆదిలాబాద్ అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, ఆదిలాబాద్, నిర్మల్, కుమురం భీం, ఏఎస్‌డీఎస్పీలు, డీఎస్పీలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షిషా

చోరీ కేసులో నిందితుడి అరెస్ట్

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని హైటెక్ సిటీలో చోరీకి పాల్పడిన వ్యక్తిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ భన్సీలాల్ తెలి పారు. ఆసిఫాబాద్ జిల్లా చింతలమానెపల్లికి చెందిన లత్కారి సాయి కిరణ్ బుధవారం తెల్లవారు జామున హైటెక్ సిటీలో పిల్లలమర్రి వంశీకి చెందిన నిర్మాణంలో ఉన్న నూతన అపార్ట్‌మెంట్‌లోకి వెళ్లి గేటు తాళం పగులగొట్టి ప్లంబింగ్ సామగ్రి, పైపు బెండల్‌ను దొంగిలించాడు. వంశి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. బుధవారం రాత్రి అనుమానాస్పదంగా తిరుగుతున్న సాయికిరణ్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా నేరం అంగీకరించడంతో నిందితున్ని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

పరిశోధనలు పొలాల్లోకి చేరాలి

జగిత్యాలఅగ్రికల్చర్: వ్యవసాయ శాస్త్రవేత్తల పరిశోధనలు పొలాల్లోకి చేరాలని, అప్పుడే రైతులకు మేలు జరుగుతుందని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం రీసెర్చ్ డైరెక్టర్ రఘురామిరెడ్డి అన్నారు. ఉత్తర తెలంగాణ ప్రాంతంలో వరి విస్తీర్ణం 21శాతానికి పెరిగిందని, సోయాచిక్కుడు విస్తీర్ణం 10 శాతం పెరిగిందని, చెరుకు విస్తీర్ణం మాత్రం 73 శాతం, పెసర 61 శాతం, మొక్కజొన్న 12 శాతం, కందుల విస్తీర్ణం 8శాతం, పత్తి విస్తీర్ణం నాలుగు శాతం తగ్గడం ఆందోళన కలిగిస్తోందని తెలిపారు. జగిత్యాల రూరల్ మండలం పొలాస వ్యవసాయ పరిశోధన స్థానంలో ఉత్తర తెలంగాణ జోనల్ స్థాయి శాస్త్రవేత్తల సమావేశాలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఉమ్మడి కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్ జిల్లాల వ్యవసాయ శాస్త్రవేత్తలు, ఆయా జిల్లాల వ్యవసాయ, ఉద్యాన శాఖ అధికారులు పాల్గొన్నారు. వ్యవసాయ వర్సిటీ డైరెక్టర్ ఆఫ్ ఎక్స్‌టెన్షన్ సుధారాణి, పొలాస వ్యవసాయ పరిశోధన స్థానం డైరెక్టర్ శ్రీనివాస్, అగ్రికల్చర్ డిపార్ట్‌మెంట్ రాష్ట్ర డైరెక్టర్ బాలు మాట్లాడారు. అనంతరం వివిధ పంటల సాగు బ్రోచర్లను ఆవిష్కరించారు.